# నా పట్టుచీరా కన్నతల్లీ

బొట్టు తరువాత ఆడదాని ముఖానికి అందం కలిగించేది చిరునవ్వే,

ఇద్దరు మొగాళ్ళ కంటె ఇద్దరు ఆడవాళ్ళు ఎక్కువ నవ్వుతారని నేను ఛాలెంజి చేసి చెప్తాను.

ఎవరి మొహం జిడ్డోడుతున్నా నేన్భూళ్ళేను. మనుష్యులను చూడగానే అంతస్తులవారీగా తగిలించుకునే ఆఫీసర్ల పెళ్ళాల మేలురకం చిరునవ్వులంటే నాకు వొళ్ళుమంట.

చిత్రకారుడు బొమ్మల ముఖాలమీద గీసే విషాదరేఖలు నాకు గిట్టవు.

యౌవ్వనాన్ని సంపదను, సమృద్ధిని పొంగుని ఉల్లాసాన్ని ఉద్రేకాన్ని సూచించే గీతలంటే నాకు చాలా యిష్టం;

ఎవరైనా నవ్వితే ఆ నవ్వు గోడకు వాల్ పోస్టర్ అంటించినట్లుండకూడదు.

నుదుటి బొట్టులా ముక్కుపుడకలా, సిగలో పువ్వులా ముఖానికి నవ్వు పవిటకు జలతారంచు లాటిది.

గుండెల రెపరెపలు, గాజుల గల గలలు. నవ్వుల కలకలలు ఎంతో బావుంటాయి. చీరల గరగరలు, జాకెట్ల మెత్తదనం, పొట్టమీద మడత నడుం దగ్గర ఒంపు, వెన్నుమీద బాణంలా వంకర, పాదాల మీద జీరాడే కుచ్చెళ్ళు, పసుపు రాసుకున్న కాళ్ళ అందం, మెళ్ళో గంధపు సువాసనలు తల్లో పూవుల ఘుమగుమలు మెళ్ళో నల్లపూసలు గుండెల దగ్గర వొత్తుకునే తాళిబొట్టూ, కంటికి కాటుక, పెదవులపై తాంబూల పరాగం - అబ్బ;

వూరిఖే అన్నాడా "ఇయంగేహే లక్ష్మీ" అని శ్రీరామ చంద్రుడు,

సహింపరానిది, ఈమెతోటి ఎడబాటొక్క టేనట

మా వారుకూడా కంగారుగా "నా వైఫ్ - నా వైఫ్" అని రిఫర్ చేస్తుంటారు నన్ను.

మా ఊరొచ్చినపుడు అల్లా పిలవకండి ప్లీజ్ అంటూంటాను. మా వాళ్ళు తాటాకులు కడ్తారు సార్.

ప్రేమకు పరాకాష్ఠ కొంగు పట్టుకు లాగడవేఁ. కాదన్ను

* * *

నూరు ఇడ్లీలైనా ఒకపెసరట్టుతో సమానం కాదు. పది పెసరట్లయినా ఒక ప్రేమకథ పాటిచెయ్యవు. ఎన్ని ప్రేమ కథలయినా ఒక ముద్దుకు సాటిరావు. ఎన్ని ప్రేమ ముద్దులయినా ఒక కౌగిలింతకు చెల్లవు. కోటి కౌగిలింతలయినా సంతోషంగా గడిపిన రాత్రికి సమంకావు.

మీట నొక్కితే చంద్రుడు వెలగడు.

వెలక్కపోయినా వెన్నెల కరువైతే మెర్క్యురీ బల్బుతో సరిపెట్టుకోవచ్చు.

మెర్కురీ బల్బుకు కూడా నోచుకోనివారు ఏ కిరసనాయిలు బుడ్డి దీపమో, కోడిగుడ్డు దీపమో హరికేన్ లాంతరో, కొవ్వొత్తో ప్రమిదలో నూని పోసిన దీపమో దేన్తోటో సరి పెట్టుకోవాలి.

చీకట్లో చిందులు తొక్కితే ఏం లాభం?

ఎవరూ చీకట్లో బతకకూడదు.

అందరిళ్ళలోకి అంతో యింతో కాంతి - గుడ్డి వెన్నెలైనా ప్రసరించాలి.

లేనిబావకంటె గుడ్డిబావ మేలుగా -

బావ గుడ్డివాడైతే చలాకీ మరదలు పిల్లకి బ్లెస్సింగిన్ డిజ్ గ్రేస్; కళ్ళలో కారం కొట్టమని కాదు, కొట్టొచ్చు;

మా బావ కళ్ళజోడు పెట్టుకుంటారు కాని ఆయన అద్దాలు సోడాకాయ అడుగులం తేసిలేవు.

★ ★ ★

మా ఊళ్లో పక్క వీధిలో మా నాన్నకు ఎగస్పార్టీ వెంకుమాంబ మొగుడు సోడాబుడ్డి అద్దాలు పెట్టుకుని పెళ్ళాన్ని వెతుక్కుంటూ "వెంకూ పెంకూ" అంటూ అరుగుమీద కూర్చున్నఆడవాళ్ళ మీద మీదకు వస్తాడు. వాడుకాకుండా మరో నలకూబరుడెవడైనా తమ తమ నిజభార్యలను పోల్చుకుందుకు అలా మీద మీదకి వస్తే గొప్ప తమాషాగావుండును. పైకి చచ్చినాడమ్మా. పొయ్యేకాలం అని మెటికలు విరుస్తారు కాని అలా పరాయి మగాడు మీదిమీదికి తరుముకు రావడం వాళ్ళ కిష్టమే; సోడాబుడ్డి కళ్ళద్దాలవాడు కాకుండా ఆకర్ణాంత విశాలనయనుడెవడైనా అట్లావస్తాడా అని ఎక్స్‌పెక్టు చేస్తున్నట్లుంటాయి ఆ అరుగులమీది ఆడవాళ్ళ మొహాలు. ఆ సంభ్రమంలో చీరలమీంచి ఎరుపు రంగు వాళ్ళమొహాల్లోకి ప్రాకడం కొట్టొచ్చినట్లు ఆపడొచ్చు. ఒక్క మాటు పెల్లుబికినట్లు ఆడవాళ్ళ నవ్వులు హేళన రంగరించిపోసిన రింగు రింగు చుట్టుకుపోయిన నవ్వుల బొంగరాలు మాఊరి అరుగుల మీద ఆడవాళ్లు, బల్లిలా అంటిపెట్టుకుని నల్లేరు కాడలా నక్కినక్కి ఆ సోడాబుడ్డి కళ్ళజోడు గాడి వెనక్కాల వెళ్ళే వెంకుమాంబ మీదికి తమనవ్వుల్ని గైడెడ్ మిసల్లీలా పంపుతూంటారు అరుగులమీది ఆడాళ్ళు, పట్టణాల్లో యిప్పుడు ఆడాళ్ళున్నా అరుగులు లేవు, అరుగు లుంటే మంచాలు అక్కర్లేదు.

"ఏంవే నీ మొగుడేడే..." అని మా ఊళ్ళో వయసుమళ్ళి సరదాలు తీరని ముసలమ్మలంతా టాంటింగుగా అడుగుతారు.

వయసులో మాంచి కాకమీదున్న కుర్రాళ్ళని టాంట్ చేసి ఏడిపించడం ముసలమ్మలకు సరదా - పిల్లను తీసుకుపోతామంటారు. ఆషాఢమాసం అంటారు. శూన్యమాసం అంటారు. ఇంకా దిబ్బా దిరుగుండం బోల్డు సవాలక్ష అడ్డంకులు చెప్పి చేతిలోని లడ్డుండను తన్నుకు పోతారు, అబ్బాయిని అమ్మాయిని విడగొట్టడానికి ఎన్ని రకాలైన రూల్సున్నాయో అవన్నీ లాంఛనంగా వాళ్ళమీద ప్రయోగించి తట్టుకుంటారో లేదో చూస్తారు.

పెళ్ళయినవాళ్ళనే ఎన్నో యిబ్బందుల పాల్జేస్తున్న మన దేశంలో ప్రేమించుకున్నవాళ్ళని మంచినీళ్ళు కూడా త్రాగనివ్వరు.

చేతిలో మిఠాయి చేతిలోనే వుంటుంది. దానిని తిననివ్వరు, దొంగ రాస్కెల్సు మనవాళ్ళంతా-

★ ★ ★

మొగుడేవిటి? మొగుడూ మొద్దులూనూ -

ఈ పల్లెటూరి లేడీస్‌కి మేనర్స్ బొత్తిగా తెలియవు. ఎవత్తి ఊళ్లో కాలు పెడితె దాని పూర్ హజ్‌బెండ్‌గురించి అన్‌నెససరీ ప్రశ్నలడుగుతారు. "మా ఇంటి మగవారిని గురించి నాకే చాలా సంగతులు తెలియవే మామా" అని చెప్పేసి నేను గబగబా అరుగుమీంచి నడవలోకి పారిపోతూంటాను.

"తిక్కలంజ-" అనేస్తారు పైకి రపీమని.

"నా మనవడేడే-" అని ఒకామె అడుగుతుంది.

అప్పుడు నేను మా వారికేసి చూస్తాను. ఆయన మనవడంటే మరొక రెవరో వున్నారనుకొని గాబరాగా యిటూ అటు చూస్తూంటారు.

"సడె బాగుంది. మనవడంటే మీరేనండి!" అని చెబితే తేరుకుని ముఖానికి పట్నం నుంచి తెచ్చిన చిరునవ్వు వొకటి తగిలించుకుంటారు.

గుడ్‌మార్నింగ్ బామ్మా; అంటే - " ఏవిటా పొగరుమోతు మాటలు - దగ్గరిసా రా వీపు బద్దలుకొడతానే లంజకానా" అని అమృతం కురిపించే చూపులతో ముద్దులాడే ముసలమ్మల మధ్య నా కెలాగో ప్రొద్దుపోతుంది. కాని మావారు మాత్రం నాగరికతని ఆపేక్షతో సమన్వయించుకోలేక అప్పుడప్పుడు ఇన్సల్టని చిందులు త్రొక్కుతూంటారు.

"మనవడంటె అభిమాన పడేవాళ్ళుండాలిగాని ఇన్సల్టేవిట్రా కుర్రాడా" అని ఎవరో అంటే తెల్లబోయి నా కేసి చూశారు. తిట్టు ప్రేమకి పర్యాయపదం.

"టేక్ కేర్! పల్లెటూళ్ళలో ప్రేమలుండవను కోకండి" అని వార్నింగు ఇచ్చాను.

మీట నొక్కితే చంద్రుడు వెలగడు, నిజవేఁ

చెలి కౌగిట్లో వొక చంద్రుడు

కన్నులలో వొక చంద్రుడు

టౌన్లో వెన్నెల మాకు కరువైపోయాక మేము మెర్క్యురి బల్బుల్ని వాడి తృప్తిపడుతున్నాం.

గాలి బిగించేస్తే ఫ్యాను గాలీ...ఇంతకీ చెప్పొచ్చేదేవిటంటే -

పట్టుచీర కట్టుకుని పేరంటాని కెళ్ళొచ్చా.

శెనగలమూట రేడియో మీద పెట్టి తాంబూలము పోకచెక్క టీపాయ్‌మీద పెట్టి ఆ హడావిడిలో విడిచిన చీరను పెట్టిమీదకుప్పలా పడేశా.

ఆ మెర్క్యురీ బల్బు కాంతిలో మా వారి కళ్ళకు రాసివోసిన రత్నాల కుప్పలా పేరంటానికి కట్టు కెళ్ళిన బనారస్, పవిటంచు పెద్ద జరీ పువ్వుల పట్టుచీర కనిపించిందట.

నిజమే అత్తరు సువాసనలతో ఘుమ ఘుమ లాడిపోతున్న ఆ పట్టుచీరను మృదువుగా ముట్టుకుని చూశారు.

మళ్ళీ కట్టుకోమంటారనుకున్నాను.

ఆయన కళ్ళతో ఆ చీరను కావిలించుకున్నారు.

నాకు చెప్పరాని సంతోషం కలిగింది.

నేను పరవశించిపోయాను.

ఒకవేళ రేపు నేను చచ్చిపోతే ఒక్క క్షణం ఈ పట్టుచీరకేసి చూస్తే నేను వారికి పూర్తిగా జ్ఞాపకానికి వస్తాను?

అప్పుడా చీరను మహోత్కంఠతలో వారు కావిలించుగుంటారు.

లక్ష ఫోటోలు కూడా ఆ పట్టుచీరకు సాటిరావు.

అయ్యో; నా పట్టుచీరా - కన్నతల్లీ;

# బల్లకట్టు బెల్లపావకాయ

కొత్త చింతకాయలు తింటే డాక్టరుకి డబ్బొస్తుంది. మనకు జబ్బొస్తుందీ, మా ఊరుకాలవగట్టు పొడవునా చింతచెట్లే -

చీకూ చింతా లేకుండా ఎవరూ జీవించలేరు. కాలవగట్టుమీద చింత చెట్లుండాల్సిందే. చింతచెట్లు క్రిందనుంచి బస్సులు రిక్షాలు మనుష్యులూ తిరగాల్సిందే.

కాలవ వుండాలి. (మా ఊరికో కాలవుంది) కాలవమీద బల్లకట్టు వుండాలి.

కాలవకి రెండువైపులావున్న ఊళ్ళకి వంతెన లేకపోతే బల్లకట్టే ప్రాణం.

మా కాలవ నరసాపురం కాలవ.

మా ఊరు మార్టేరుకి మైలున్నర.

కాలవ బల్లకట్టు లేకపోతే ఊరికి అందంలేదు.

నాకు బల్లకట్టంటే ఇష్టం.

మా వూరి బల్లకట్టు నాకు చిన్ననాటి నేస్తం

ఆ బల్లకట్టుమీద కూర్చుని నీళ్ళల్లో కాళ్ళాడిస్తూ వూసులాడుకునేవాళ్ళం. పోసుకోలు కబుర్లు, కథలూ, కాకరకాయలూ చెప్పుకునే వాళ్ళం.

ఆ కాలవ నీళ్ళూ ప్రవాహం. వాటి మిలమిలలు ఆకాలవమీదకు వంగి నీడలు చూసుకొంటున్న చెట్లు. ఆ గట్లమీద పరుగులెత్తి చెట్టా పట్టాలు వేసుకుతిరిగి మేము ఆడుకున్న ఆటలు పోట్లాటలు గుర్తే.

ఆ కాలవ ఎండిపోయినప్పుడు యిసకలో ఎన్నో పిచ్చుకగూళ్ళు కట్టాం. చలమలు తవ్వి లిక్కిలిక్కి చెంబుతో నీళ్ళు తెచ్చుకునే వాళ్ళం.

కాలవ నిండుగా వున్నప్పుడు భయంవేసేది.

నిజవేఁ